నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | సెప్టెంబర్ 19, 2024 | www.navatelangana.com

గోవింద.. గోవిందా

- ముగిసిన జెండా బాలాజీ ఉత్సవాలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఏడుకొండలవాడా వెంకట రమణా గోవిందాగోవిందా బాలాజీ భగవాన్ కి జై అంటూ భక్తులు గోవిందుని స్మరించుకుంటూ భక్తి శ్రద్ధలతో జెండా జాతర కొనసాగింది. గత 14 రోజులుగా జిల్లా కేంద్రంలోని బాలాజీ మందిరం లోని ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం అధిక సంఖ్యలో భక్తులు జెండాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. జెండా బాలాజీ మందిరం నుంచి జెండాను ముందుగా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం గోడపై నుంచి దాటించారు. జెండాను సిర్నాపల్లి గడి లోఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. అక్కడి నుంచి గోల్ హనుమాన్ చేరుకున్న జెండాకు భక్తులు చక్కెరను స్వామివారికి సమర్పించుకుని పూజలు నిర్వహించారు. ఊరేగింపుగా సిర్నాపల్లి గడి మీద నుంచి ఫులాంగ్ వరకు శోభాయాత్రను నిర్వహించారు.

బాక్సింగ్ ఛాంపియన్‌కు డీఎస్పీ ఉద్యోగం

- నిఖత్ జరీన్‌కు ఉత్తర్వులు అందజేత



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రముఖ బాక్సిగ్ క్రీడాకారిని నిజామాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్ కు రాష్ట్ర ప్రభుత్వం డీఎస్పీ పోస్టు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర డీజీపీ జితేందర్ నిఖత్ జరీన్ కు డీఎస్పీగా బుధవారం ఉత్తర్వులు అందజేశారు. ఇటీవల ఇస్తాంబుల్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో గెలిచి చాంపియన్‌గా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నజరానాతో పాటు హైదరాబాద్‌లో నివాస స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అర్జున అవార్డును ప్రదానం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 1 పోస్టు అయిన డీఎస్పీగా నిఖత్ జరీన్‌కు ఉత్తర్వులు అందజేసింది.

వినాయక మన్నించు

- వినాయకుల ప్రతిమలతో నిండిన బావి
- గత్యంతరం లేక మాదవనగర్‌లో మురికి నీటిలో నిమజ్జనం
- ఏర్పాట్లపై మండలి నిర్వాహకుల ఆగ్రహం
- మారిన నిమజ్జనం తంతు.. బుధవారం సైతం కొనసాగిన వైనం



విగ్రహాలతో పూర్తిస్థాయిలో నిండిపోయిన వినాయకుల బావి

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

వినాయక చవిత పండగను 11 రోజుల పాటు పూర్తినిష్టతో, భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తుండగా.. నిమజ్జనం రోజు మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా కొనసాగుతోంది. మంగళవారం నిమజ్జనం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వినాయకుల బావిలో 5 ఫీట్ల కంటే తక్కువ ఎత్తు ఉన్న వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. కాగా సుమారు అర్ధరాత్రి సమయం వరకు బావిలో వినాయకుల ప్రతిమలతో పూర్తిస్థాయిలో నిండిపోయింది. పైనకు నీరు లేకున్నా.. నిమజ్జనం చేసే ఏకైక లక్ష్యంగా విగ్రహాలను అందులో వేయడం గమనార్హం. పూర్తిస్థాయిలో మునగకున్నా అందులో నిమజ్జనం చేసి తంతు పూర్తి చేయడమే లక్ష్యంగా వేసి వెళ్లిపోయారు. కాగా అందులో బావిలో అనుమతించకపోవడంతో మాదవ్‌నగర్‌కు వెళ్లే దారిలో ఉన్న చిన్న నీటి మడుగులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. అక్కడ సరైనా ఏర్పాట్లు చేయకపోవడంతో గట్టు మీద నుంచి వినాయకులను నిమజ్జనం చేయడంతో ఏ ఒక్క విగ్రహం పూర్తిస్థాయిలో మునిగిన దాఖలాలు లేవు. ప్రత్యామ్నాయం లేక కొందరు తప్పని పరిస్థితుల్లో అక్కడ నిమజ్జనం చేయగా.. పలువురు మాత్రం తంతు పూర్తి చేసే ఏకైక లక్ష్యంతో నిమజ్జనం చేసినట్టుగా కనిపించింది. అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంపై మండపాల నిర్వహకులు మండిపడ్డారు. గజ ఈతగాళ్లను సైతం ఏర్పాటు చేయకపోవడంతో ఏదైనా ప్రమాదవశాత్తు ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో కాపాడే నాథుడే లేకుండా పోయాడు.

మారిన నిమజ్జనం తంతు..

గతంలో సాధారణంగా 11వ రోజు నిమజ్జనం సమయంలో అదే రోజు రాత్రి 8 గంటల లోపు వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించి 12 గంటల లోపు నిమజ్జనం పూర్తి చేసే వారు. కానీ గత మూడునాలుగేండ్లుగా పలు మండపాల నిర్వహకులు నిమజ్జన తంతు పూర్తిగా మార్చేశారు. ఈసారి మంగళవారం నిమజ్జనం చేయాల్సి ఉండగా.. జిల్లా కేంద్రంతో పాటు పలు చోట్ల ఏకంగా అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు నుంచి నాలుగు గంటల సమయంలో మండపం నుంచి బయటకు తీశారు. రోడ్ల వెంట తెల్లవార్లు నృత్యాలు చేసుకుంటూ వెళ్లడం కనిపించింది. మరికొందరైతే ఏకంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నిమజ్జనానికి తరలించడం కనిపించింది. ఆ సమయంలో సైతం డీజేలు, బాక్సులు పెట్టుకొని నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలిస్తుండటం విశేషం. వినాయక నవరాత్రి ఉత్సవాల రూపురేకలను పూర్తి మారిపోతోందని పలువురు ఆవేదన చెందుతున్నారు.



బోర్గాం బ్రిడ్జి దాటిన తర్వాత మాధవ్‌నగర్‌కు వెళ్లే దారిలో ఉన్న కుంటలో మురికి నీళ్లలో విగ్రహాల అసంపూర్తి నిమజ్జనం

నిర్లక్ష్యానికి తావిస్తే చర్యలు

- వసతి గృహాల పనితీరు మెరుగుపడాలి
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- హాస్టళ్ల నిర్వహణ తీరుపై సంక్షేమ అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల పనితీరు మెరుగుపడేలా సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు హితవు పలికారు. విద్యా వ్యవస్థను పటిష్టపర్చడం ద్వారా విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల నిర్వహణ తీరుతెన్నులపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. హాస్టళ్లలో నెలకొని ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకుని, గడిచిన మూడు సంవత్సరాల నుండి పదవ తరగతి వార్షిక పరీక్షల్లో సాధించిన ఉత్తీర్ణత గురించి ఒక్కో హాస్టల్ వారీగా వివరాలు ఆరా తీశారు. ఇటీవలే జిల్లా ఉన్నతాధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు తదితరులు హాస్టళ్లను తనిఖీ చేసిన సందర్భంగా గమనించిన లోటుపాట్లను ప్రస్తావిస్తూ, వాటిని చక్కదిద్దుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాల్సిన గురుతర బాధ్యత సంక్షేమ అధికారులపై ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కించుకునేలా విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలన్నారు. కేవలం సగటు ఉత్తీర్ణతతోనే సరిపెట్టుకోకుండా, ప్రతి విద్యార్థి మెరిట్ సాధించేలా చొరవ చూపాలని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుండే చక్కటి ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఉపయోగకరంగా, సౌకర్యవంతంగా ఉండే బ్రాండెడ్ వస్తువులనే వినియోగించాలన్నారు. ప్రతి వసతి గృహంలో సరిపడా తాగునీరు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్ లు అందుబాటులో ఉండాలని, టాయిలెట్స్, వాష్ ఏరియా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా మౌలిక సదుపాయాల కొరత నెలకొని ఉంటే, ప్రభుత్వ పరంగా సౌకర్యాల కల్పనకు తాము చొరవ చూపుతామని, విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన బోధన అందేలా సంక్షేమ అధికారులు కృషి చేయాలని అన్నారు. ప్రైవేట్ బడులతో పోలిస్తే ప్రభుత్వ విద్యా సంస్థలలో పనిచేసే అధ్యాపకులు, వసతి గృహాల సంక్షేమ అధికారులు ఎక్కువ ప్రతిభ కలిగి ఉంటారని, తదనుగుణంగా విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దేందుకు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, అన్ని హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో పిల్లలకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యా బోధన, సరైన వసతి సదుపాయాలు అందుబాటులో ఉండేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు. తనతో పాటు జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా ఎక్కడైనా నిర్వహణపరంగా లోపాలు వెల్లడైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు ఏ చిన్న ఇబ్బంది సైతం తలెత్తకుండా సమర్థవంతంగా వసతి గృహాలను నిర్వహించాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజనం కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన సరుకులు, కూరగాయలను వినియోగించాలని హితవు పలికారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యాధికారిని సంప్రదించి చికిత్స చేయించాలని, పై అధికారులకు సమాచారం తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి హాస్టల్ లో ఎల్లవేళలా అధికారులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉంటూ పర్యవేక్షణ జరపాలని, రాత్రి వేళల్లోనూ తప్పనిసరిగా హాస్టల్ లోనే ఉండాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, కళాశాలల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, ఈ సందర్భంగా ఎక్కడైనా లోటుపాట్లు జరిగినట్లు తేలితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంస్థల ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, సంక్షేమ శాఖల అధికారులు, ఆర్.సీ.ఓలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



సమీక్షలో హాజరైన అధికారులు

డీజే సౌండ్‌కు గుండెపోటుతో యువకుడు మృతి

నవతెలంగాణ-మాక్లూర్



డీజే సౌండ్‌కు గుండెపోటుతో యువకుడు మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉరడీ మధు యాదవ్ (27) డిజే శబ్దానికి గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు మాణిక్ బండారుకు చెందిన హిందూ సేన యువజన గణేష్ మండలి వారి గణేష్ విగ్రహంను నిమజ్జనానికి తీసుకువెళ్లడానికి మధు యాదవ్ తన ట్రాక్టర్‌తో మాణిక్ బండారు గ్రామానికి వచ్చి గణేష్ విగ్రహం తీసుకొని రామాలయం వద్దకు రాగా అక్కడ ఉదయం మూడు గంటలకు గుడి ఆవరణలో పడుకున్నాడు. ఉదయం 8 గంటల సమయంలో గణేష్ యువజన సభ్యులు అతనిని నిద్ర లేపగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతుని భార్య సంజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు గుండెపోటుతో మరణించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

అర్ధరాత్రి యువకుల ఘర్షణ

- బీరు బాటిల్లు, రాళ్లతో పరస్పరదాడులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని నాల్గవ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి యువకులు ఘర్షణకు పాల్పడ్డారు. ఒకరిపై ఒకరు బీరు బాటిళ్ల, రాళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. మంగళవారం రాత్రి నగరంలోని ఆర్యనగర్ పెట్రోల్ బంక్ వద్ద గల గణేశ్ మండలి యువకులు, మరో మండలి యువకుల మధ్య డీజే విషయంలో మాటామాట పెరగడంతో ఇరువర్గాల యువకులు దాడులు చేసుకున్నారు. బీరు బాటిళ్ల, రాళ్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నాలుగవ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్కడికక్కడ యువకులను ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ విషయమై ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలియజేశారు.

డెంగ్యూతో చికిత్స పొందుతూ రిసెప్షనిస్ట్ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

డెంగ్యూ బారిన పడి ఓ యువతి మృతిచెందింది. మోపాల్ మండలం అమ్రాబాద్కు చెందిన బాదావత్ సంగీత(24) నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టా పనిచేస్తోంది. అయితే గత మూడు నాలుగు రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతోంది. దీంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మరణించింది.



సంగీత(ఫైల్)

స్కూల్ బస్సులో నుంచి పొగలు

- పిల్లలను స్థానికులు దించేయడంతో తప్పిన పెనుప్రమాదం
- ఆ సమయంలో సుమారు 30 మంది విద్యార్థులు
- స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై సందేహాలు

నవతెలంగాణ-కామారెడ్డి

సుమారు 30 మంది విద్యార్థులను స్కూల్‌కు తరలిస్తున్న బ్రిలియంట్ హై స్కూల్ బస్సులో నుంచి బుధవారం ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురైయ్యారు. ఆ సమయంలో అక్కడ ఉన్న స్థానికులను పిల్లలను సకాలంలో బస్సులో నుంచి కిందకు దించడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే బస్సు ఫిట్‌నెస్‌లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది.

బ్రిలియంట్ హైస్కూల్ బస్సు జిల్లా కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో నడుస్తుండగానే అందులో నుంచి పొగలు రావడంతో విద్యార్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీంతో వెంటనే తమ పిల్లలను బస్సు ఎక్కించడానికి వచ్చిన తల్లిదండ్రులు పిల్లలను తీసుకొని దూరంగా జరిగి వెళ్లిపోయారు. బస్సులో ఉన్న పిల్లల సైతం ఏడ్చుకుంటూ కిందికి దిగారు. ఏ మాత్రం ఆలస్యమైనా ఏమి జరిగేదోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు బస్సు కండిషన్‌ను పరిశీలించిన అనంతరమే దానిని పిల్లలను తీసుకురావడానికి పంపించవలసిన పాఠశాల యజమాన్యం చూసి చూడనట్లు వ్యవహ రించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ప్రమాదం ఊరు బయట జరిగి ఉంటే ఏం జరిగేదోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ బస్సు ఇన్సూరెన్స్ ఉందా, ఫిట్నెస్ ఉందా అన్ని ఉంటే ఇలాంటి ప్రమాదం ఎందుకు జరుగుతుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాలలపై దృష్టి సారించాలని జిల్లా ప్రజల కోరుతున్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ , మండల విద్యాశాఖ అధికారులను వివరణ కోరగా ఆ పాఠశాల యజమాన్యానికి ఇంకోసారి ఇలా జరిగిత పాఠశాలకు తాళం వేస్తామని హెచ్చరించడం జరిగిందన్నారు.



పొగలు వస్తుండటంతో పిల్లలను దించుతున్న స్థానికులు

పకడ్బందీగా ఇంటింటి సర్వే

అమ్మ ఒడి కార్యక్రమంలో లక్ష్యాలను చేరుకోవాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



రికార్డులు తనిఖీ చేస్తున్న రాజశ్రీ

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న సేవలు, రికార్డులను పరిశీలించారు. జ్వరం ఉన్నటువంటి ఏరియాలలో తక్షణమే ఆరోగ్య క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణీలను అమ్మ ఒడి కార్యక్రమంలో లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే తప్పకుండా ప్రసవాలు జరిగేటట్లు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎమ్స్ చూడాలన్నారు. అందుకొరకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ఉండకూడదన్నారు. జ్వరం ఉన్న ప్రతి కేసుకు రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, అప్పుడే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా మొదలగు వ్యాధులు అరికట్టవచ్చునని తెలియజేశారు. ఆమె వెంట ఉప వైద్యాధికారి డాక్టర్ రమేష్, డివిజన్ మలేరియా నియంత్రణ అధికారి సాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తీర్ణ అధికారి సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ పవన్, ఫార్మసిస్ట్ అరుణ్, సిబ్బంది, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జ్యోతిబాపూలే బాలుర హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నా

నవతెలంగాణ- కామారెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు

కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర హాస్టల్లోని సమస్యలు పరిష్కరించాలని పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హాస్టల్లు అన్నీ కూడా కొత్త పుంతలు తొక్కుతాయనీ, హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి మొక్కుబడిగా అద్దె భవనాలలో రెసిడెన్షియల్ హాస్టల్ లను ప్రారంభించినట్టు తెలిపారు. బీబీపేట్ మండల కేంద్రం కూడా అద్దె భవనంలో కొనసాగుతుందని, ఇందులో 250 కెపాసిటీ ఉంటే 430 మంది ఉంటున్నారని తెలిపారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకుండా, మరుగుదొడ్లు లేకుండా, వాటికి సరైన డోర్స్ లేకుండా కిటికీలకు సైతం డోర్స్ లేకుండా ఉండడం వలన వర్షం పడినప్పుడల్లా కిటికీలో నుంచి వర్షం నీరు తరగతి గదులలోకి రావడం వలన ఆ వర్షానికి బట్టలు తడిసిపోవడం, విద్యార్థులు రాత్రులు నిద్ర లేకుండా మేలుకొని కూర్చోవడం ఇలాంటి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులకు, ఆర్ సి ఓ కు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కొత్త భవనం నిర్మిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, అప్పుడే అన్ని సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. స్పందించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని మెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు 50 మందికి పైగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలపై అభ్యంతరాలుంటే కార్యదర్శులకు దరఖాస్తు చేయాలి

జిల్లా ఎన్నికల అధారిటీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 13 న ప్రచురించబడిన ముసాయిదా ఓటరు జాబితాలపై ఈ నెల 21 వరకు అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు సమర్పించవచ్చని జిల్లా ఎన్నికల అధారిటీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. బుధవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ముసాయిదా జాబితాలను స్థానిక గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ఈ నెల 13 న ముసాయిదా జాబితా ప్రకటించడం జరిగిందని, అట్టి జాబితాలపై అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే ఈ నెల 21 లోగా సంబంధిత పంచాయతీ కార్యదర్శి లకు అందజేయాలని తెలిపారు. అట్టి అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 26 లోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. తుది ఫోటో ఎలెక్టోరల్ జాబితాను ఈ నెల 28 న ఆయా గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత జాబితా సాఫ్ట్ కాపీ లను రాజకీయ పార్టీలకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారునికి చిక్కిన భారీ కొండచిలువ

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట్ మండలంలోని పోల్కంపేట గ్రామంలో ఓ మత్స్యకారునికి వళ్లకు భారీ కొండచిలువ చిక్కినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొల్లారం సిద్దయ్య అనే మత్స్యకారుడు రోజువారి మాదిరిగా మంగళవారం చేపల వేటకు వెళ్లాడు. చేపల కోసం కట్టిన చేపల వలలో చేపలకు బదులు సుమారుగా 15 అడుగులు ఉన్న భారీ కొండచిలువ వలలో చిక్కింది. దీన్ని చూసిన ఒకసారిగా బయపడి భయం నుండి తెరుకొని వలనుండి దానిని వేరు చేసాడు. వల నుండి వేరుచేసిన కొండచిలువను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు, కొండచిలువల వల్ల ప్రాణాలకే ప్రమాదం అని భయందోళనలు వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా చేపల వేటకు వెళ్లిన మొట్టమొదటిసారిగా చేపలవలకు కొండచిలువ వచ్చిందన్నారు.

రూ.45 వేలకు లడ్డు వేలం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రం లోని వినాయక నగర్ 100 ఫీట్స్ రోడ్డు లో గల ఏకాదంత గణేష్ మండలి లో మంగళవారం వినాయక నిమజ్జన సమయంలో లడ్డు వేలం పాట నిర్వహించడం జరిగింది. ఈ లడ్డు వేలం పాటలో రవిగౌడ్ 45000/- కు లడ్డు ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా రవి గౌడ్ మాట్లాడుతూ.. వినాయకుని ఆశీస్సులతో లడ్డును వేలంపాటలో దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు.


లడ్డూను అందుకుంటున్న రవి

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుకున్న ట్రాక్టర్లు

నవతెలంగాణ - పోతంగల్

మండల కేంద్రం నుండి బుధవారం కోటగిరి వైపు వెళ్తున్న అక్రమ ఇసుక లోడుతో ఉన్న నెంబర్‌లేని ట్రాక్టర్‌ను పోతంగల్ శివారులో పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్, కోటగిరి నందు అప్పగించారని తహసీల్దార్ జె. మల్లయ్య తెలిపారు. విచారణ చేయగా ట్రాక్టర్ పోతంగల్ గ్రామానికి చెందిన గంధపు గంగాధర్ ట్రాక్టర్ యజమాని అని తెలిసినదని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే ట్రాక్టర్లపై, యజమానులపై కేసులు నమోదుచేస్తామని తెలిపారు. ట్రాన్స్‌ఫర్ అధికారులకు, మైనింగ్ అధికారులకు సీజైన ట్రాక్టర్లను అప్పజెప్పుతామన్నారు. ఇంకనూ బైండోవర్ చేసి, సిఆర్‌పిఎఫ్ 07 క్రింద కేసులు కూడా నమోదు చేసి, క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మండలంలోని ట్రాక్టర్ యజమానులు వారి ట్రాక్టర్లను, ఇసుక అక్రమ రవాణాకు ఉపయోగించకూడదని తహసీల్దార్ తెలిపారు.

వరిలో రోగనివారణ చర్యలు చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ ఉస్సేన్

నవతెలంగాణ-మాక్లూర్

వరి పంటలో తగు జాగ్రత్తలు పాటించి రోగ నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ ఉస్సేన్ సూచించారు. బుణవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు పడిన తరువాత సన్నారకాల వరిలో దోమపోటు, ఎండు ఆకులు కనిపిస్తూ ఉంటాయని, దోమపోటు అనేది తొందరగా వ్యాప్తిస్తుందని, సమయం కూడా ఇవ్వదని, రైతులు రెండు రోజులకు ఒక్క సారి వరి పంటలో అడుగు భాగంలో సందర్శించి పైమెట్రజిన్ ఎకరానికి 120 గ్రాములు పిచికారి చేయాలని, కింది భాగంలో మందు పడేలా చూడాలని అన్నారు. వరిలో పాయలు తీయని, నీరు తక్కువగా ఉండేలా చూడాలని, ఎండు అకు తెగులుకు స్ట్రెప్టోమేసిన్ సల్ఫేట్ ఎకరానికి 60 గ్రాములు పిచికారి చేయాలని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయాధికారులు సందర్శించి సూచనలతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మ రైతులు పాల్గొన్నారు.

రికార్డులు సరిగ్గా నిర్వహించాలి
జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ ఉస్సేన్.

ప్రతి సైడ్‌షాప్‌లలో రికార్డులను సరిగ్గా నిర్వహించాలని, రైతులకు మోతాదుకు మించి మందులను ఇవ్వకూడదని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ ఉస్సేన్ తెలిపారు. బుధవారం మండలంలోని బోర్గం(కె), మాక్లూర్ ప్రాథమిక సహకార సంఘం, మాదాపూర్ అగ్రోస్, చిక్లి గోదాం ఆయన ఆకస్మికంగా తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను, మందులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి పద్మ ఉన్నారు.


మాక్లూర్: క్షేత్ర స్థాయిలో రైతులతో మాట్లాడుతున్న దృశ్యం


డిచ్‌పల్లి లో..

డిచ్‌పల్లి: ప్రస్తుత కాలంలో వరి పంటలో వివిధ రకాల రోగాలు, తెగుళ్ళ సోకడం గమనించామని, వరిలో ముఖ్యంగా బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడి దోమ, ఆకు ముడత, అగ్గి తెగులు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారిణి సుద మాధురి, ఇందల్ వాయి మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాల పరిధిలోని పలు గ్రామాలను విస్తరణ అధికారులతో కలిసి పంట పొలాలను క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటలో ఈ సమయంలో ముఖ్యంగా కనిపించే బ్యాక్టీరియా ఎండాకు తెగులును తొలిదశ లో నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా ఆపివేయాలని అన్నారు. కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రా స్ట్రెప్టమైసిన్ 60 గ్రాములు ఎకరానికి వాడితే ఈ తెగులు సోకకుండా నివారించవచ్చని సూచించారు. ఇందల్ వాయి మండలంలోని వెంగల్ పాడ్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో వరి పంటకు ఆకు ముడత, మోగి పురుగు ఆశించిదని తెలిపారు. దీని నివారణకు క్లోరనిప్రో Chlorantraniliprole 60 మీల్లి ఎకరానికి పిచికారీ చేసుకోవాలని అన్నారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించి ఉందని, దీని నివారణకు పైపాటుగా యూరియా వాడకం తాత్కాలికంగా నిలిపివేయాలని రైతులకు సూచించారు. ఎండాకు తెగులుకు సరైన మందు లేదని, వరి పైరు పొట్ట దశలలో ఉన్నపుడు రాగిధాతు సంబంధిత మందులు పిచికారి చేస్తే తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ప్లాంటోమైసిన్ వాడడం వల్లన కొంత వరకు తగ్గించవచ్చని వ్యవసాయ అధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. వారి వెంట వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్, రైతులు ఉన్నారు.

బాలాజీ జెండా జాతర ఊరేగింపు


జెండాను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ నందిపేట్

మండలంలోని వెల్మల్ గ్రామంలో బాలాజీ జెండా జాతర పండగను బుధవారం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వెంకటేశ్వర ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి కొబ్బరికాయలు, చక్కెర, బెల్లం చిన్న చిన్న పతాకాలు, పూలు సమర్పించారు. అనంతరం జెండాను ప్రధాన విధుల గుండా భుజాలపై మోస్తూ కోలాటాలు ఆడుతూ, మహిళలు నృత్యాలు చేస్తూ ఊరేగింపు చేపట్టారు. భక్తులు జెండా కింది నుంచి దూరుతు మొక్కులు చెల్లించుకున్నారు. జెండాను జిల్లా బాలాజీ జెండా ఆలయానికి తీసుకెళ్లి అనంతరం తిరుపతికి పంపిస్తామమని విడిసి సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. వచ్చిన భక్తులకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అన్నం వడ్డించారు .

విద్యార్థులకు బూట్లు పంపిణీ


విద్యార్థులకు బూట్లు పంపిణీ చేస్తున్న జాతి రత్నాలు యూత్ సభ్యులు

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని నిజాంపూర్ ప్రాథమిక పాఠశాలలో జాతి రత్నాలు యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతి రత్నాలు యూత్ సభ్యులు రమేష్ మాట్లాడుతూ తమ యూత్ ద్వారా సేవా కార్యక్రమాలను చేసే ఉద్దేశంలో భాగంగా 63 మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రావు, రవీందర్, యూత్ సభ్యులు రవి, సంజీవ్, గంగారెడ్డి, సురేష్, సాయిలు, ప్రశాంత్, నరేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే


ఎల్‌ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మాచ్చర్ల గ్రామానికి చెందిన చెందిన దొడాల దేవన్న గుండెకు సంబంధించిన ఆపరేషన్ కోసం 4లక్షల రూపాయల ఎల్‌ఓసి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బుధవారం అందజేశారు. అంకాపూర్ గ్రామానికి చెందిన కుసియా బేగం మెదడుకు సంబంధించిన చికిత్స కోసం 5 లక్షల ఎల్‌ఓసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపరేషన్లకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సల కోసం ఎల్‌ఓసి అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మచ్చర గ్రామానికి చెందిన రాంరెడ్డి, అంకాపూర్ గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు రఫిక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటర్ల జాబితాపై మండల స్థాయి సమావేశం

నవతెలంగాణ-బాల్కొండ

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితాలను ఈనెల 13న నోటిఫికేషన్ బోర్డులపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితాపై అవగాహన, అభ్యంతరాలపై గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తామని ఈ సమావేశానికి రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

జిల్లా జుడో ఎంపికలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నిజామాబాద్ ఆధ్వర్యంలో జూడో క్రీడలో అండర్-14, అండర్-17 బాలురు, బాలికల కోసం సంయుక్త జిల్లా జుడో ఎంపికలను నిర్వహించనున్నామని ఎస్‌జిఎఫ్ సెక్రటరీ ఎం. నాగమణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఎంపికలు ఈనెల 21న డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్, నిజామాబాద్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, వెయిట్ కేటగిరిలో జూడో అండర్-14 బాలురు, బాలికలు, జుడో అండర్-17, బాలురు, బాలికలు ఎంపికలకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా తమ బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని, మిగిత సమాచారం కోసం అనిత పీడి నెంబర్ 7893973128 కి సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ ఎంపికల కార్యక్రమం క్రీడాభిమానులకు గొప్ప అవకాశం అందిస్తుందని, యువ క్రీడాకారులకు పటిమను ప్రదర్శించే వేదికను అందిస్తుందని తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ఒకటి, నాలుగో అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి తెలిపారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి పోషకాహారాన్ని అందించినట్లు ఆమె పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటలు, పాటలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సురేఖ సుజాత, ఆయా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాలలో స్వచ్ఛత హి సేవా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జాతీయ సేవా పథకం " స్వచ్చత హి సేవా - 2024" కార్యక్రమంలో భాగంగా గిరిరాజ్ కళాశాల స్వయంప్రతిపత్తి నిజామాబాద్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు - 6 ఆధ్వర్యంలో కళాశాల పరిసరాల్లోగల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరణ కార్యక్రమం నిర్వహించామని ప్రిన్సిపాల్ డా. రామ్ మోహన్ రెడ్డి తెలిపారు. ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. అబ్దుల్ రేఫిక్, ఎస్. రంగరత్నం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. ఈ. వెంకట రమణ, జీ. సుధాకర్, జీ నాగజ్యోతి, టీ నరేష్ కుమార్, ఎం దస్తప్ప, ఎస్. రజిత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఆటో యూనియన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని బోధన్ బస్టాండ్ దగ్గర గల ఆటో యూనియన్ అడ్డాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 22 23 తేదీల్లో కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. మేరకు గురువారం పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కన్వీనర్ పి. హనుమానులు మాట్లాడుతూ... ఆటో కార్మికుల సమస్యలపై చర్చించడానికి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయించడానికి, మోటార్ వెహికల్ రంగంలో తీసుకొస్తున్న సవరణలు విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీలో భాగంగా ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, అడ్డాలకు స్థలాలను కేటాయించాలని, ట్రాఫిక్ పోలీసుల ఆర్టిఏ అధికారుల వేధింపులు మానుకోవాలని, ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే చెల్లించాలని తెలిపారు. సమస్యలపై చర్చించి రాబోయే కాలంలో ఆటో డ్రైవర్లను ఉద్యమానికి సిద్ధం చేయడానికి మహాసభ నిర్వహిస్తున్నామని అన్నారు. కార్మికుల పెద్ద సంఖ్యలో హాజరైన చేయాలని కోరాఉ. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయి, ఆటో యూనియన్ అధ్యక్షులు అజీజ్, అహమ్మద్, గంగారం సాయిలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

పిడిఎస్‌యూ 50వ వార్షికోత్సవ సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పిడిఎస్‌యు 50వ వార్షికోత్సవ సభ వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏరియా అధ్యక్షులు అనిల్ కుమార్ అధ్యక్షత వహించగా. ఈ సందర్భంగా సిపిఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి బి దేవారం. బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,ముత్తెన్న, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఏం. నరేందర్ ముఖ్య వ్యక్తులుగా హాజరయ్యారు. డివిజన్ కార్యదర్శి బి.దేవరం మాట్లాడుతూ.. 1972లో జార్జి రెడ్డి అనే విద్యార్థి నాయకుడు ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా విద్యార్థి హక్కుల కోసం, సమాజ స్థాపన కోసం, శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడి పిడిఎస్‌యును స్థాపించారన్నారు. ఆయన దారిలోనే జంపాల చంద్రశేఖర వరప్రసాద్ నిజామాబాద్ వాసి పిడిఎస్‌యుగా ఏర్పాటు చేసి విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసి అమరవీరులుగా నిలిచారన్నారు. విద్యార్థులకు స్కాలర్షిప్ల, మెస్ చార్జీలు, హాస్టళ్ల, కళాశాలల్లో మౌలిక వసతులకోసం పోరాటం చేస్తున్నారన్నారు. 50 సంవత్సరాల సందర్భంగా హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఈనెల 30న సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అక్టోబర్ 1న పిడిఎస్‌యు ఆల్ ఇండియా పిడిఎస్‌యుగా అవతరించబోతుందని తెలిపారు. విద్యార్థులు, మేధావులు పాల్గొని సభను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పిడిఎస్యు ఆర్మూర్ ఏరియా నాయకులు మమత , వైష్ణవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పిడిఎస్‌యూ నాయకులు

టేస్టీ తెలంగాణ ట్రీట్స్ నిజామాబాద్ వంటల పోటీలు

- 18-32 ఏళ్ల యువతులకు సువర్ణావకాశం..

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

టేస్టీ తెలంగాణ ట్రీట్స్ నిజామాబాద్ వంటల పోటీలు నిర్వహించనున్నామని, జిల్లాలోని మహిళలను, యువతులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంలో ఏర్పాటు చేశామని ఇన్ఫినిటీ కళాశాల హెూటల్ మేనేజ్మెంట్, ఫ్యాషన్ డిజైనింగ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ రత్నాకర్ పేడూరి అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో ఫ్యాషన్ డిజైనింగ్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ మాధురి, అక్షరలతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ పేడూరి మాట్లాడుతూ.. 18 నుంచి 32 సంవత్సరాల యువతులకు వంటల పోటీలు తెలంగాణ ఛెఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టేస్టీ తెలంగాణ ట్రీట్స్ నిజామాబాద్ - 2024 వంటల పోటీల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. జిల్లాలోని ఫుడ్ ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళలు వంటలు చేసి పేరు సంపాదించాలని, వంటలు చేసి మెప్పించాలని సమయం కోసం వేచి చూస్తున్న వారి కోసమే అని అన్నారు. పోటీలో పాల్గొనే వారికి ఉచిత ఎంట్రీ ఉంటుందని, వారు చేసే వంటకాల సామగ్రి తెచ్చుకోవాలని అన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించనున్నామని, వారిని హైదారబాద్‌లో జరిగే ఫైనల్ పోటీలకు పంపనున్నామని, సెలబ్రెటీ చెఫ్‌గా ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్య అతిథులుగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బెస్ట్ ఛెఫ్స్ హాజరుకానున్నారని అన్నారు. ఇతర వివరాలకు నేరుగా ఇన్ఫినిటీ హెూటల్ మేనేజ్ మెంట్ కళాశాల కు, ఈ 81061 82233 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన


మాట్లాడుతున్న సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-రెంజల్

పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలు ప్రత్యేకతను సాధించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం రెంజల్ మండల కేంద్రంలోని కస్తూరి బాలికల పాఠశాలలో బాలికలకు దోమల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సలహాలు ఇచ్చారు. ముందుగా పాఠశాలల్లోని ఆవరణ, తరగతి గదులలో దోమల మందు పిచికారి చేయించారు. డెంగ్యూ దోమ అత్యంత ప్రమాదకరమైనదని దాని బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, సుజాత, స్వప్న, శిల్ప, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక


మాట్లాడుతున్న విద్యుత్ ఉన్నతాధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని ఏర్గట్ల సబ్ స్టేషన్‌లో ఏర్గట్ల, మోర్తాడ్, కమ్మర్ పల్లి, బషీరాబాద్ సెక్షన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను విద్యుత్ ఉన్నతాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సీజీఆర్‌ఎఫ్ చైర్ పర్సన్ నారాయణ మాట్లాడుతూ...కరెంట్ మీటర్లకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయని, సంబంధిత ఏఈకి సమస్యలు వివరించి, త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. బుధవారం హాజరుకాని విద్యుత్ వినియోగదారులు ఆన్లైన్ లో గాని, నిజామాబాద్ సీజీఆర్‌ఎఫ్ ఆఫీస్‌లో కంప్లయింట్ చేయవచ్చని తెలిపారు. రైతులు ముఖ్యంగా వారి పంట పొలాల్లో కెపాసిటర్స్ బిగిస్తే, వారికి విద్యుత్ సంస్థకు మేలు జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా విద్యుత్ ఉన్నతాధికారులు రామకృష్ణ, కిషన్, రాజగౌడ్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును చిట్టాపూర్ గ్రామానికి చెందిన బాధితుడు దమ్మడి సాయన్నకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాల్కొండ మండల ఉపాధ్యక్షుడు సట్ల గంగా ప్రవీణ్, గంగామల్లు, బద్రి, గ్రామ అధ్యక్షుడు గంగాధర్, పద్మారావు, ఎస్. హరీష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నవతెలంగాణ-కంఠేశ్వర్

చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడని మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ బుధవారం తెలిపారు. నగరంలోని పవన్ నగర్‌కు చెందిన పాటి సంతోష్ (40)కు కొన్ని ఏళ్లుగా డైరీ ఫాం వ్యాపారం ఉంది. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఉన్న ఎనిమిది పశువుల్లో ఒక్కొక్కటి మృత్యువాత పడుతున్నాయి. ఈ మేరకు తీవ్ర నష్ట జరగడంతో మనస్థాపానికి గురై ఈనెల 12 న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన నిజామాబాద్ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ద్విచక్ర వాహనం అదుపు తపడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు యువకులు గౌతంనగర్‌కు చెందిన వారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా బాసర గోదావరికి వెళ్తున్నారు. ఈ క్రమంలో శ్రీశాంక్, ఆయన స్నేహితుడు ఇద్దరు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. గమనించిన స్థానికులు హుటాహుటిన 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయతను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ

తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్, సహా ఆచార్య డా. ఆర్.సుధాకర్ గౌడ్‌ను దోమకొండ మాజీ జెడ్పిటిసి తీగల తిర్మల్ గౌడ్, మాజీ .ఎంపీపీ . జాంగారి గాలి రెడ్డి శాలువాతో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అంజయ్య డాక్టర్ లలిత, డాక్టర్ యాదాద్రి డాక్టర్ నారాయణ, డాక్టర్ సునీత, సరిత, మరియు కాంగ్రెస్ నాయకులు సీతారాం మధు, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామలను సందర్శించిన సిఈఓ


విద్యార్థులతో మాట్లాడుతున్న సిఈఓ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చందర్ నాయక్ బుధవారం సందర్శించారు. మండలంలోని సజ్జ నాయక్ తండా పుర్య నాయక్ తండా యాచారం లక్ష్మి నాయక్ తండా గ్రామాలలో పాఠశాల అంగన్వాడి కేంద్రాలు గ్రామపంచాయతీ కార్యాలయం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్ ఎంపీ ఓ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై విచారణ షురూ

- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి
- ఇసుక క్వారీల నిర్వహణపై అసంతృప్తి

నవతెలంగాణ-నసురుల్లాబాద్


మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టినట్లు కామారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండల కేంద్రం మంజీరా నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఇసుక క్వారీలను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి లు కలిసి పరిశీలించారు. ఇసుక క్వారీల వద్ద పని చేయని సీసీ కెమెరాలు, వేయింగ్ మిషన్ సక్రమంగా లేకపోవడం, నిఘా వైఫల్యం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక రవాణా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని వేయింగ్ మిషన్ ద్వారానే లారీలు వెళ్లాలని మైనింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మంజీరా నది పరివాహక ప్రాంతం లో ఉన్న ఇసుక క్వారీల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న ఫిర్యాదు మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక స్పెషల్ టీం గా ఏర్పడి క్వారీలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ ఇసుక క్వారీల ద్వారా అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఆరోపణల మేరకు విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. నేడు పూర్తిస్థాయిలో విచారణ జరిపి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా కొందరు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదాయ వనరుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ క్వారీ ప్రైవేట్ వ్యక్తులకు వరంగా మారిందని, గతంలో 90 శాతం అక్రమ రవాణా జరగగా 10 శాతం మాత్రమే ప్రభుత్వ ఖజానాకు వెళ్లేదని, కొందరు అక్రమ క్వారీ నిర్వాహకుల వల్ల ప్రభుత్వానికి రావలసిన ఆదాయం రాకుండా పోయిందన్నారు. అక్రమ రవాణా జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరారు. దీనికి జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ విచారణ చేపట్టడానికి వచ్చామని, అక్రమ రవాణా జరిగితే చర్యలు తప్పవన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా?

బాన్సువాడ డివిజన్ పరిధిలో ఉన్న మంజీరా నది పరివాహక ప్రాంతం లో ఉన్న ఇసుక క్వారీల నుండి అక్రమ ఇసుక రవాణా మూడు పూవులు ఆరు కాయలుగా మారింది. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవలసిన మైనింగ్ శాఖ అధికారులు, సిబ్బంది అక్రమ దారులకు సహకరించడంతో ఇసుక క్వారీ నిర్వాహకులు 10 శాతం లారీలు వేబిల్ ద్వారా ఇసుక రవాణా చెయ్యగా 90 శాతం అక్రమ మార్గంలో తరలి వెళ్లడంతో రాష్ట్ర ప్రభుత్వం అక్రమార్కులపై ఉక్కు పాదం మోపింది. వెంటనే అక్రమ మైనింగ్ అధికారులు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తూ క్వారీలను రద్దు చేసింది. అలాగే క్వారీ నిర్వాహకులు పెట్టిన జమానత్ డబ్బులను కూడా జప్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయ వనరులను సమకూర్చాల్సిన అధికారులే అక్రమదారులతో కుమ్మక్కై ప్రభుత్వ రావాల్సిన ఆదాయానికి గండి కొట్టారు. గతంలో మైనింగ్ శాఖకు చెందిన ఓ సిబ్బంది ప్రభుత్వ జీతం తీసుకుంటూనే నాలుగు టిప్పర్లను అద్దెకు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి నిత్యం తన టిప్పర్లను అక్రమ రవాణా చేసేవాడు. ఈ విషయం జిల్లా అధికారులకు తెలియడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. మంజీరా నది పరిహాక ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోవడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేయడంతో స్పందించిన ప్రభుత్వం వెంటనే క్వారీలను రద్దు చేసింది. క్వారీలు రద్దు అయి గత రెండు మాసాలు గడుస్తున్నప్పటికీ వాటిపై విచారణ చేపట్టి తిరిగి ఇసుక క్వారీలను కొనసాగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

కొత్తగా వచ్చిన జాయింట్ కలెక్టర్ బాన్సువాడ సబ్ కలెక్టర్ ఏమైనా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తారా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వనికి ఆదాయం వచ్చే విధంగా అధికారులు సిబ్బంది గురించి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల తాజా చర్యలతో ఏమేరకు అడ్డుకట్ట పడుతుందో చూడాలి.

పటేల్ సాబ్ ఆరోగ్యం ఎలా ఉంది..?

- మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

పటేల్ సాబ్ ఆరోగ్యం ఎలా ఉంది నన్ను గుర్తుపట్టావా అంటూ మద్నూర్ మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు రౌత్ వార్ వేద్ ప్రకాష్ పాటీల్‌ను బుధవారం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పరామర్శించారు. అనారోగ్యంతో మద్నూర్ మాజీ సర్పంచ్ వేద్ ప్రకాష్ పాటీల్ ఉండటంతో ఈ విషయం తెలుసుకుని మాజీ ఎమ్మెల్యే షిండే మద్నూర్ మండల కేంద్రాన్ని సందర్శించి మాజీ సర్పంచ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయమై ఆరా తీశారు. ఆయన వెంట మాజీ సొసైటీ ఛైర్మన్ పాకల విజయ్, కంచిన్ హన్మండ్లు, రవి, తూం హన్మండ్లు, నాగేష్, దేవిదాస్, రాజు మాజీ సర్పంచ్ కుమారుడు మీర్జాపూర్ ఆంజనేయస్వామి ఆలయ మాజీ చైర్మన్ అనిల్ పటేల్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన డిఐఓ


ఫైల్‌లను తనిఖీ చేస్తున్న డిఐఓ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిస్టిక్ ఇమినైజేషన్ అధికారి డాక్టర్ విద్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల వివరాలు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న కోల్డ్ చైన్ సిస్టంను పరిశీలించిన అనంతరం ఇసన్నపల్లి గ్రామంలో జరిగే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషకాహారం లోపం ఉన్న పిల్లలకు డాక్టర్ దివ్య, ఆర్ బి ఎస్ కే వైద్యులు మనోజ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోషకాహార లోపం ఉన్న పిల్లలకు మందులు అందజేసి తగు సూచనలు సలహాలను తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి


- ఎంపీఓ మలహరి


సందర్శిస్తున్న ఎంపీఓ మలహరి

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామాల్లో చెత్తా చెదారం పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లింగంపేట్ మండలం ఎంపిఓ మలహరి గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. బుధవారం లింగంపేట గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన కూడలి వద్ద చెత్తను పరిశీలించి తొలగించాలని ఆదేశించారు. అనంతరం రామాలయం సమీపంలో రామాలయం ముందు పిచ్చి మొక్కలు పెరగపోవడంతో సిబ్బంది తో పిచ్చి మొక్కలను తొలగించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్ కుమార్ అశ్వక్ కార్యదర్శులు సిబ్బంది తదితరులు.

కమిటీ సభ్యులకు సన్మానం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం చైర్ పర్సన్ చాంబర్లో నూతన అయ్యప్ప సేవా సంఘం, అన్నప్రసాద సేవ సంఘం కమిటీ సభ్యులను ఆమె శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వార్థం ఎక్కువైన ఈ రోజుల్లో సన్మార్గంలో నడుస్తూ, ఆకలితో ఉన్న వరికి అన్నదానం చేస్తూ, ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని సూచిస్తూ ముందుకు సాగుతున్న అయ్యప్ప సేవా సంఘం సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం, అన్నప్రసాద సేవా సంఘ కమిటీ అధ్యక్షులు నస్కంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాస్, కోశాధికారి సోమిశెట్టి నారాయణ, ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి గంజి సతీష్, నవీన్, విశ్వనాథుల రాజేందర్, బూస రవికుమార్, కూర శ్రీనివాస్, వెతుకురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్నాథ్ షిండే వర్గ బుల్దాన నియోజకవర్గం ఎమ్మెల్యే గైక్వాడ్ సంజయ్.. రాహుల్ గాంధీ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం మద్నూర్ ఉమ్మడి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపంలో ఆ ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మహారాష్ట్ర ఎమ్మెల్యే గాయక్వాడ్ సంజయ్‌కి హెచ్చరిస్తూ ఖబర్దార్ ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే పుట్టగదులు ఉండవని హెచ్చరించారు. మహారాష్ట్ర ఎమ్మెల్యే ఇటీవల రాహుల్ గాంధీ నాలుక కోస్తే రూ .11లక్షలు ఇస్తానని అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, సీనియర్ నాయకులు చౌలావార్ హనుమాన్లు, రామ్ పటేల్, కొండ గంగాధర్, వట్నాల రమేష్, విట్టల్, గురూజీ, దిగంబర్, బాలు, షిండే విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌కు నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

బిజెపి సీనియర్ నాయకులు తమ్మేవార్ రమేష్ ఈనెల 5న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బుధవారం సంతాప సభ నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అఫీషియల్ మీడియా స్పోక్స్ పర్సన్ అదిలాబాద్ పార్లమెంట్ ప్రభరి అల్జాపూర్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

ఓటరు జాబితాపై నేడు సమావేశం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని 18 గ్రామ పంచాయతీలలోని 182 వార్డులకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఈనెల 13వ తేదీ నాడు ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో నోటీసు బోర్డుపై ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన ఓటర్ల జాబితాపై నేడు గురువారం రోజు మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధుల సమావేశం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయడం జరుగుతుందని సమావేశానికి హాజరై ఓటర్ల జాబితాలో అభ్యంతరాలను తెలియజేయాలని ప్రకటనలో తెలిపారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బుధవారం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యాధికారి దేవేందర్ గ్రామంలోని పశువులకు పి పి ఆర్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ పశు దన్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని టీకాలు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సురేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

బదిలీపై వెళ్లిన, నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు బుధవారం మండలంలోని గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పాల లావణ్య మల్లేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రతినిత్యం విద్యాబుద్ధులు నేర్పుతున్న వారి సేవలను వెలకట్టలేని మని అన్నారు. ఏ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరి చర్చించి సమిష్టిగా నిర్ణయము తీసుకొని పేద విద్యార్థుల కోసం సమస్యలను పరిష్కరించామని గుర్తు చేశారు. మాజీ ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయులు స్వామి, బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులు రాజు కుమార్, ఉపాధ్యాయులు అశ్విక్ లను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ చైర్మన్ సత్యనారాయణ, గ్రామస్తులు కే రాజయ్య వీ లింగం, డ్వాక్రా సంఘాల మహిళలు సుశీల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన

- నిరంతర హైజీన్ కార్యక్రమాలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన, వసతి సౌకర్యాలు అందించాలని, నిరంతర హైజీన్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం రోజున కామారెడ్డి పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (లింగంపేట్) ను కలెక్టర్ తనిఖీ చేసారు. గురుకులంలోని తరగతి గదులు, డార్మెటరీ, వంటశాల, స్టోర్ రూం లను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ, మంచి విద్యను అభ్యసించాలనీ, ట్రిపుల్ ఐటి లో సీట్ సాధించే విధంగా విద్య ను అభ్యసించాలి అన్నారు. భోజనం ఎలా వుంది, విద్య బోధన ఎలా వుంది అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేకుండా విద్యార్థినులు బయటకు వెళ్తున్నారా అని అడిగారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి భోజనం అందించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రంగనాథ రావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిని రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ప్రిన్సిపాల్ డా. వనిత, తహసీల్దార్ జనార్ధన్, తదితరులు ఉన్నారు.

మతాల సారం ఒక్కటే

రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది మహమ్మద్ మోహినమ్మద్ ఖాద్రి

నవతెలంగాణ-లింగంపేట్

మతాల సారం ఒక్కటే అని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది మహమ్మద్ మోహినమ్మద్ ఖాద్రి అన్నారు. మంగళవారం రాత్రి ఓం గణేష్ మండలి బృందం సభ్యులు పూలదండ వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. లింగంపేట పట్టణ కేంద్రంలోని ఓం గణేష్ మండలి 70 మంది యువకులకు స్థానిక గ్రామపంచాయతీ ముందర వినాయక చవితి సందర్భంగా వినాయకుని ఏర్పాటు చేశారు. వినాయకుని విగ్రహానికి రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది రాష్ట్ర జలమండలి సభ్యులు మమ్మద్ మోయినమ్మద్ ఖాద్రి వినాయకుని విగ్రదాతగా విరాళాలు హెూం గణేష్ యూత్ సభ్యులకు అందించారు. మంగళవారం రాత్రి వినాయకుని శోభాయాత్ర సందర్భంగా ఆయన నివాసం వద్దకు చేరుకొని పూలదండ వేసి శాలువా తప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒకటే అన్ని దేవుళ్ల ఒక్కటే నని అన్నారు. సేవ చేయడానికి కులము మతము అడ్డురాదన్నారు. తన సంపదనులో సగభాగం పేద ప్రజలకి సేవ చేస్తానని ఆయన ఈ సందర్భంగా సూచించారు. సన్మాన కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ డివిజన్ కార్యదర్శి రవి గౌడ్ డాక్టర్ విట్టల్ ఓం గణేష్ యూత్ అధ్యక్షులు కేశవ్ కుమార్ ఉమేష్ లోకేష్ కుమార్ ఉదయ్ చింటూ తో పాటు గణేష్ మండల్ సభ్యులు తదితరులన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-దోమకొండ

స్వయం సహాయక సంఘంలోని మహిళలు వ్యాపారవేత్తలుగా కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీయం సుధాకర్ అన్నారు. దోమకొండ మండలం లోని ముత్యం పేట్ గ్రామం లో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్, కిరాణం దుకాణం, బట్టల షాపు లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సంఘం మహిళలు వ్యాపార రంగంలో మహిళా సంఘాల ద్వారా రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, డిపియం సుధాకర్, , ఏపీఎం రాజు, సీసీ లు శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఏర్పాటుకు తీర్మానం

నవతెలంగాణ-రామారెడ్డి



రామారెడ్డిలో రైతుల నూతన సొసైటీని ఏర్పాటు చేయాలని బుధవారం అట్లూరు ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి అధ్యక్షతన పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేశారు. నూతనంగా ఏర్పడిన మండలంలో 11 గ్రామపంచాయతీలు ఉన్న సొసైటీ లేకపోవడంతో రైతులకు ఇబ్బంది ఉన్నందున ప్రభుత్వం నూతన సొసైటీని ఏర్పాటు చేసి రైతులకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అమ్ముల పశు పతి, పాలకవర్గ సభ్యులు గురుజాల నారాయణరెడ్డి, గొల్లపల్లి లక్ష్మా గౌడ్, రాజేందర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సిఇఓ కడెం బైరయ్య తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి సమన్వయంతో కలిసి పని చేయాలి

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం సమన్వయంతో పని చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్రనాథ గౌడ్ గ్రామస్థాయి కార్యకర్తలకు సూచించారు. బుధవారం లింగంపేట్ మండలంలోని కొండాపూర్ మంభుజిపేట మంబోజి పేట తండా రాంపూర్ గ్రామాలలో గ్రామస్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉన్నట్టయితే తమ దృష్టికి తీసుకురావాలని ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని సమస్యలు సకాలంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ మండల నాయకులు. మాజీ సర్పంచులు . రామ్ రెడ్డి. బలరాం నాయక్ మండల కాంగ్రెస్ నాయకులు వంజరి ఎల్లమ్మ నగేష్.రామకృష్ణ గౌడ్. అశోక్. రఫీ యోద్దీన్. రమేష్. పీర్ సింగ్. ఫుల్ సింగ్ రాజు రెడ్డి నాగయ్య. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడి పిల్లలకు వైద్య పరీక్షలు



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డి, అన్నారం పిహెచ్సి పరిధిలో అన్నారం, పోసానిపేట, ఇసన్నపల్లి, రామారెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య పరీక్షలు, వైద్యులు సురేష్, మానస ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కిషోర్ బాలలకు అంగన్వాడీ ద్వారా వచ్చే బాలామృతం, గుడ్డు తప్పకుండా వినియోగించుకోవాలని, ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవలసిన జాగ్రత్తలపై తల్లులకు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది పద్మ, జ్యోతి, శోభ, అంగన్వాడి సూపర్వైజర్ ఉమారాణి, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, కిశోర బాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నవతెలంగాణ-గాంధారి



గాంధారి మండలంలోని గండిపట్ తండాకు చెందిన నేనవత్ ధిరాజ్‌కుచెందిన గేదె విద్యుత్ షాక్ తో మృతి చెందింది. గేదె మృతితో సుమారు 50 వేల రూపాయల నష్టం వాటిల్లిందని ఆయన వాపోయాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని ఆయన విద్యుత్ అధికారులు కోరారు.

అభినందనలు తెలిపిన గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం జీఓ విడుదల చేయడానికి కృషిచేసిన నాయకులకు గల్ఫ్ జెఏసి ప్రతినిధులు అభినందనలు తెలిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్ భూపతి రెడ్డి, ఆర్మూర్ కాంగ్రెస్ ఇంచార్జి పి. వినయ్ కుమార్ రెడ్డిని గల్ఫ్ జెఏసి ప్రతినిధులు చెన్నమనేని శ్రీనివాస రావు, మంద భీంరెడ్డిలు బుధవారం అసెంబ్లీ ఆవరణలో ఘనంగా సన్మానించారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు

ప్రహరీ నిర్మాణానికి విరాళం అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని విశ్వకర్మ సంఘ భవనం ప్రహరి గోడ నిర్మాణంకోసం ఎడపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రామచందర్ రూ.10,116 బుధవారం విరాళం అందజేశారు. విశ్వకర్మ సంఘం నాయకులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.



విరాళం అందజేసిన రామచందర్

చందూర్‌లో ఇండ్ల స్థలాల హద్దులు చూపెట్టాలి

- సబ్ కలెక్టర్‌కు సీపీఐ(ఎం) వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

చందూర్ మండల కేంద్రంలోని మర్రి బొగడ కాలనీలో పట్టాలు ఇచ్చిన వారికి హద్దులు చూపించాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ ప్రభుత్వం 2007లో మర్రిబొగడ కాలనీలో ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి, హద్దులు చూపెట్టకపోవడంతో లబ్ధిదారులల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాలకు వెంటనే హద్దులు చూపించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ విన్నపానికి సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సమస్య పరిష్కారం కొరకు ఆదేశాలు ఇస్తామని తెలిపారని అన్నారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని నన్నేసాబ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సాయిబాబా, భూమయ్య, సాయిలు, బాగవ్వ, గంగామణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

యువకుని రక్తదానం

నవతెలంగాణ - భీంగల్ రూరల్



రక్తదానం చేస్తున్న యువకుడు

కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూరు గ్రామానికి చెందిన మలవత్ జశ్విని అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అమ్మాయికి బ్లడ్ తక్కువ ఉందని చెప్పారు. ఎ పాజిటివ్ బ్లడ్ కావాలని వైద్యులు తెలపగా మలావత్ జస్విని అన్న మలవత్ కృష్ణ నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణానికి చెందిన ఎన్ ఎస్ యూ ఐ ఉపాధ్యక్షుడు సయాద్ రెహ్మాన్‌కు ఫోన్ చేయగా వెంటనే స్పందించి ఎ పాజిటివ్ బ్లడ్ కావాలని గ్రూపులలో ఫార్వర్డ్ చేశారు. గ్రూప్‌లో చూసిన దావీద్ రాజు నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఎ పాజిటివ్ బ్లడ్ అందజేశారు. సమయానికి రక్తాన్ని అందించిన దావీద్ రాజు కు సయ్యద్ రహమాన్‌కు కుటుంబ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్



పరామర్శిస్తున్న వీజీగౌడ్

నవతెలంగాణ డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండలం లోని బర్దిపూర్ గ్రామంలో వివిధ కారణాలతో ఆకస్మికంగా మృతి చెందిన ఈగ బాగా రెడ్డి, బూరుగుపల్లి రవీందర్ రెడ్డి కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్ గౌడ్, దర్పల్లి మాజీ జడ్పీ టిసి, బీఆర్ఎస్ యువ నాయకులు బాజిరెడ్డి జగన్ మోహన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరామర్శించారు. ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, మృతి కి గల కారణాలను అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు. వారి వెంట బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, సినీయర్ నాయకులు నీరడి పద్మారావు, నల్లవెల్లి సాకలి సాయిలు, కృష్ణారెడ్డి, ఒడ్డెం నర్సయ్య, సుధాకర్ రెడ్డి, ఎండి షాదుల్లా, నాగేంద్రబాబు, సురేష్, ప్రభాకర్, భూమయ్య, లింగం సరిత తోపాటు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామానికి బస్సులు నడపండి

- గతంలో రోజుకు నాలుగు సార్లు వచ్చేవి
- నేడు ఒకసారి వచ్చుడు కూడా కష్టమైపోతుంది
- ఉప్పల్వాయి గ్రామస్తుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ- కామారెడ్డి

మా గ్రామానికి బస్సులు నడపండి అని రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామానికి చెందిన మహిళల, యువకులు బుధవారం కామారెడ్డి ఆర్‌టిసి డిపో మేనేజర్ కార్యాలయాన్ని ముట్టడించిన అనంతరం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ గ్రామానికి గతంలో రోజుకు నాలుగు సార్లు ఆర్టీసీ బస్సు వచ్చేదని, నేడు ఒక్క పూట బస్సు రావడం గగనమైపోతుందన్నారు. దీంతో గ్రామం నుండి విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు, మహిళలు ఇతరాత్ర పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాలంటే బస్సులు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఆర్టీసీ మేనేజర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో నిర్వహించడంతో పోలీసులు వచ్చి ఉప్పల్వాయి గ్రామస్తులకు నచ్చజెప్పి ఆర్టీసీ మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో ఆర్టీసీ సిబ్బందిని పిలిపించి ఆయనకు వినతి పత్రాన్ని అందజేయించారు. ఈ ధర్నాలో ఉప్పల్వాయి గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులకు సమతుల ఆహారం అవసరం

- ఘనంగా పోషన మసోత్సవం
- అన్నప్రాసన, సామూహిక సీమంతాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గర్భిణులకు సమతుల ఆహారం అవసరమని, తద్వారా శక్తి, రక్షణ ఉంటుందని, ఇదే కాకుండా పుట్టబోయే బిడ్డకు మంచి పోషకాలు అందుతాయని ఎంపిడిఓ లక్ష్మారెడ్డి, ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సంతోష్ కుమార్, సిడిపిఓ స్వర్ణలత, ఎంపీవో రాజ్‌కాంత్ రావు, ఏపీఎం సువర్ణ అన్నారు. బుధవారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామం లోని రైతు వేదికలో పోషణ అభియాన్ పోషణ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి చిన్నారులకు అన్నప్రాసన, సాముహిక అక్షరాభ్యాసం చేసిన అనంతరం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ లక్ష్మారెడ్డి, ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సంతోష్ కుమార్, సిడిపిఓ స్వర్ణలత మాట్లాడుతూ గర్భిణులు విటమిన్ లోపం వల్ల వచ్చే అనర్థాలను అర్థం చేసుకుని తక్కువ ఖర్చుతో ఆకుకూరలు తీసుకుంటూ ఉండాలని అన్నారు. ఇదే కాకుండా నారింజ పండ్లను, ఫలాలను, పోషక ఆహర పదార్థాలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు జెండా ఆవిష్కరణతో ప్రారంభించి, పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. తల్లులకు పిల్లల పౌష్టికారంపై అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహరాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలు లాంటి ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. ప్రసవానికి అవసరమయ్యే హిమోగ్లోబిన్ అభివృద్ధి పెంపొందించుకోవాలని తెలిపారు. పుట్టబోయే శిశువుకు, పుట్టిన తర్వాత బాలింతకు, బిడ్డకు తగినంత పౌష్టికారాన్ని అందిస్తేనే పూర్తిస్థాయి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ఒడ్డెం పోశెట్టి, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, అంగన్వాడీ సూపర్వైజర్లు శోభ, సునీత, సరిత,బి సి రంజిత్, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, వసంత, మంజుల, కల్యాణి, అసిఫా, శారద, వనజా తోపాటు మండలంలోని ఇందల్ వాయి, సిర్నపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీలు, వైద్య సిబ్బంది, ఆశలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అంగన్వాడి కేంద్రాల్లో చిల్ల పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించినట్లు అంగన్వాడీ సూపర్వైజర్ ఎస్తేరు రాణి తెలిపారు. మండలంలోని కొలిప్యాక్, మనోహరాబాద్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంగన్వాడి సూపర్వైజర్ చిన్నపిల్లలకు అన్నప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు.

రెంజల్: మండలంలోని వీరన్న గుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వచ్ఛతాహి సేవలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీల నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల గురించి అవగాహన కల్పించామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశామని గ్రామ కార్యదర్శి రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, గ్రామ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన్: బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో బుధవారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ మహిళలతో ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం సూపర్ వైజర్ గోపిలక్ష్మీ మాట్లాడుతూ గర్భిణీలకు, బాలింతలకు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారలోపం ఉన్న పిల్లలకు బాలమృతంతో పాటు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన అనుబంధ ఆహారం చిన్నారులకు అందించడంపై తల్లులకు వివరించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలుచేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రతినిధి స్వప్న, హెల్త్ సిబ్బంది దివ్య, నిర్మల, అంగన్వాడీ టీచర్లు వత్సల, సాయమ్మ, క్రాంతి,సునంధ,ఆశ కార్యకర్త జంగం కవిత తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: తీవ్ర, అతి తీవ్ర పోషణగల పిల్లలకు ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్యులతో అంగన్వాడి సెంటర్లో ఉండే తీవ్రలోప పోషణ, అతి తీవ్రలోపు పోషణ గల పిల్లలను డాక్టర్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్‌లో భాగంగా పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో వీరికి డాక్టర్‌తో స్క్రీనింగ్ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ బుజ్జి వైద్యులు డాక్టర్ సుశాంత్ రెడ్డి, మౌనిక, సిబ్బంది పద్మ, మురళి, సంతోష్, కృష్ణ, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో బుధవారం పోషణ మాస కార్యక్రమంలో భాగంగా ఏడు నెలల చిన్నారులకు సామూహిక అన్న ప్రాసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ జ్యోతి మాట్లాడుతూ.. గర్భిణి స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి అర్బన్ సూపర్వైజర్ వెంకటరమణమ్మ, టీచర్ రాజ్యలక్ష్మి, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పలిలో..



బోధన్‌మండలంలో..



ఆర్మూర్‌లో..

స్వచ్ఛత కార్యక్రమాలను పగడ్బందీగా నిర్వహించాలి

- బోధన్ డీఎల్‌పిఓ మధుకర్

నవతెలంగాణ-ఎడపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవ సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాలపై గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని బోధన్ డిఎల్‌పిఓ మధు అన్నారు. మండలంలోని తానాకాలన్ గ్రామపంచాయతీని ఆయన బుధవారం సందర్శించారు. పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సమస్య, వీధిలైట్ల ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శి రంజిత్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవ సంస్కార స్వచ్ఛతా అనే అంశంపై పాఠశాలలోని



మాట్లాడుతున్న డీఎల్‌పీవో

బాలబాలికలకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. తదనంతరం గ్రామంలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన మురికి కాలువల పనులను ఆయన పరిశీలించారు. పల్లె ప్రాంతాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆయన గుర్తు చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రజలకు, అధికారులకు, అందుబాటులో ఉండాలని సూచించారు. మురికి కాల్వలను శుభ్రం చేసిన అనంతరం ఫాగింగ్ యంత్రంతో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా అవుతున్న సందర్భంగా మంచినీటి ట్యాంకులను పక్షం రోజులకోసారి బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించే విధంగా కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు.. ప్రజాపాలన రెండో విడత కార్యక్రమంలో ప్రజలు సంక్షేమ పథకాలకోసం దరఖాస్తులు అందజేస్తే వాటిని గ్రామపంచాయతీ కార్యదర్శులు స్వీకరించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నేడు ఓటరు జాబితాపై ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19న మధ్యాహ్నం రెండు గంటలకు ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మండల పరిషత్ పాలన అధికారి హెచ్. శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఈనెల 13న ప్రతి గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులపై వార్డుల వారీగా ఓటరు జాబితాలను అతికించామని తెలిపారు. దానిలో ఎలాంటి పొరపాట్లున్నా తెలపాలని ఆయన పేర్కొన్నారు. మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో 166 వార్డులను ఎంపిక చేయడం జరిగిందని, చేర్పులు మార్పులపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముప్కాల్: గురువారం మధ్యాహ్నం 12 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల వారిగా ఓటరు జాబితాను ఈ నెల 13న గ్రామపంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించామని తెలిపారు. జాబితాల్లో అభ్యర్థనలు ఉంటే లిఖితపూర్వకంగా తెలపాలని సూచించారు.

విద్యార్థులకు పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, పోస్టర్ అంశాలపై పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, నిర్వాహకులు డి. రాములు, పాండు, గోపి, శ్రీలక్ష్మి , రూప, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

రెండో అంతస్తు నిర్మాణానికి భూమి పూజ



శిలాఫలకం ఆవిష్కరించిన కుంటరమేష్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బ్యాంకు ప్రధాన కార్యాలయంపైన కోటి రూపాయల అంచనా వ్యయంతో రెండవ అంతస్తు నిర్మాణంకోసం బ్యాంకు అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి బుధవారం భూమి పూజ చేసి, శిలాఫలకము ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు సంగ్రం నాయక్, గిర్ధవర్ గంగారెడ్డి, శాంతేశ్వర్ పటేల్, ముస్కుల సాయిరెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, శరత్, కాసల శ్రీనివాస్ రెడ్డి, నాగంపేట్ శేఖర్ రెడ్డి, రమేష్ పాటిల్, భూమన్న, లింగయ్య, మోతీలాల్, శంకర్, ఆనంద్, భూషణ్ రెడ్డి, యాదగిరి, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగభూషణం వందే, బ్యాంక్ ఉన్నతాధికారులు, బ్యాంక్ ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల, సాటాపూర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా వ్యాచారచన పోటీలను నిర్వహించినట్లు మండల పంచాయతీ అధికారి రఫీ హైమద్ పేర్కొన్నారు. సాటాపూర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించగా, రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాచారచన పోటీల్లో వెలుపొందిన విద్యార్థులకు పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ బహుమతులను అందజేశారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 20న ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి.పి మధుసూదన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంఆర్ షాపింగ్ మాల్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్ లిమిటెడ్ కంపెనీ వారు ఉద్యోగాల కోసం నియామకాలు చేపడుతారని పేర్కొన్నారు. ఇంటర్, డీగ్రీ పాసైనా మగవారు, ఆడవారు వారు అర్హులని పేర్కొన్నారు. నిమమాబాద్, మేడ్చల్, హైదరాబాద్ ప్రాంతలలో ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం, శివాజీ నగర్, నిజామాబాద్‌లో ఈనెల 20న ఉద్యోగ మేళ ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు, 9581 768413, 99487 48428, 63057 43423, 77022 59070 ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

దాడి చేసి చోరీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని బంజర తండాలో దొంగతనం చేయడానికి వచ్చి.. వ్యక్తిపై దాడి చేసిన ఆభరణాలను దోచుకెళ్లిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బంజారా తండా కు చెందిన ధనావత్ మోహన్ ధనావత్ నిర్మల అనే ఇద్దరు భార్యాభర్తలు నిద్రిస్తున్న సమయంలో ముగ్గురు దుండగులు ఇంట్లోకి చొరబడి తమ వద్ద ఉన్న బంగారాన్ని ఇవ్వమని బెదిరించి చాకుతో మోహన్ గాయపరిచినట్లు మోహన్ భార్య నిర్మల తెలిపారు. దుండగులు తమ మెడలో నుంచి 7 తులాల బంగారాన్ని అపహరించు కొని పోయినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి సిఐ రవీందర్ డిఎస్పి శ్రీనివాసులు సంఘటన స్థలానికి డాగ్ స్క్వాడ్ త చేరుకొని వివరాలు సేకరించారు. సంఘటన స్థలంలో క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించి భద్రపరిచారు. సంఘటనకు సంబంధించి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నట్లు సిఐ రవీందర్ నాయక్ తెలిపారు. విచారణ అనంతరం సంఘటనకు సంబంధించిన వివరాలను మీడియాకి వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL.JUNIOR CIVIL JUDGE, AT NIZAMABAD
O.S. No. 88 of 2024

Between:-

1. Smt. Doulat Bee w/o Late Shaik Hyder @ Shaik Babu aged 56 years occ: House hold r/o H.No.7-56, Kulaspur village of Mogpal Mandal, Dist. Nizamabad. 2. Shaik Mahboob s/o Late Shaik Hyder @ Shaik Babu aged 39 years occ:Pvt.Employee r/o H.No. 7-56/1, Kulaspur village of Mogpal Mandal, Dist. Nizamabad. 3. Hymed Hussain s/o Late Shaik Hyder @ Shaik Babu aged 37 years occ: Pvt.Employee r/o H.No.7-56, Kulaspur village of Mogpal Mandal, Dist. Nizamabad.
4. Smt. Mohammed Beebi w/o Mohammed Ayub Khan aged 45 years occ: House wife r/o H. No.7-136/1, Kulaspur village of Mogpal Mandal, Dist. Nizamabad.

...Plaintiffs

AND

1. Shaik Khader @ Khadeer s/o Shaik Imam aged 64 years occ:Business r/o H.No.4- 11/1, Ghanpur village of Dichpally Mandal, Dist. Nizamabad. 2. Shaik Ayub s/o Shaik Khader @ Khadeer aged 28 years occ:Business r/o H.No.4-11/1, Ghanpur village of Dichpally Mandal, Dist. Nizamabad. 3. Smt.Habeeba w/o Shaik Maqbool, aged 65 years occ: House hold r/o Gadi, near Hostel, Sirnapally village of Indalwai Mandal Dist Nizamabad. 4. Shaik Majid s/o Shaik Maqbool, aged 35 years occ: House hold r/o Gadi, near Hostel, Sirmapally village of Indalwai Mandal Dist Nizamabad. 5. Shaik Wajid s/o Shaik Maqbool, aged 32 years occ: House hold r/o Gadi, near Hostel,Simapally village of Indalwai Mandal Dist Nizamabad. 6. Shaik Sajid s/o Shaik Maqbool, aged 30 years occ: House hold r/o Gadi, near Hostel, Sirnapally village of Indalwai Mandal Dist Nizamabad..

...Defendants

To,
D4 Shaik Majid s/o Shaik Maqbool, aged 35 years occ: Agricuture, R/o Gadi, near Hostel, Sirnapally village of Indalwai Mandal Dist Nizamabad.

Whereas the above named Plaintiffs filed the above suit for partition, separate possession and to declare the registered gift (Settlement) deed doc. No. 9074/2019 dated 24.08.2019 as null and void against the defendants.

Take notice that the above case is posted on **07-10-2024** at 10:30 AM for your appearance. You are hereby directed to appear in person or through a pleader before this honorable court, Otherwise the case will be heard and decided on merits in your absence.

// BY ORDERS OF THE COURT //

A. RAVINDER.
ADVOCATE
H.No. 1-12-123/B1,
Opp: Munnurukapu Sangam
Pragathi Nagar, Nizamabad.
CELL NO.9440485525.

వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్స్ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆయా విభాగాలకు సీనియర్ రెసిడెంట్స్ ఖాళీల భర్తీ కి అధికారులు తాజాగా ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులకు ఈ నెల 23 న వాక్-ఇన్ - ఇంటర్వ్యూ నిర్వచించునట్లు కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. అనటామి(1), బయో కెమిస్ట్రీ (1), ఫిషలోజి (1), మైక్రో బయాలజీ(1), ఫార్మకోలోజి(1), ఎస్పిఎం(1), పేరెన్సీ(1), మెడిసిన్(1), ఈఎన్ టి,(1), ఆప్టికల్ మోలోజీ(1), జనరల్ మెడిసిన్ (4), జనరల్ సర్జరీ (3), అర్థ పెడిక్(1), ఓబీజీ(5), పీడియాటరీస్(2), రెస్పిక్టరి మెడిసిన్(1), అనేస్తిమ(1), రేడియాలోజి (1) మొత్తం 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎండి, ఎమ్మెస్, డిఎన్బి, పీజీ డిగ్రీ సీనియర్ రెసిడెంట్ పోస్ట్ క్వాలి పై 50 శాతం మార్కులు సాధించాలని పేర్కొన్నారు.

లక్ష 31వేల 111 కు లడ్డు వేలం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ బ్యాంక్ కాలనీ గణేష్ మండలి ఎల్లమ్మగుట్ట మండలి సభ్యులు లడ్డు వేలం పాట నిర్వహించారు. రూ.1,31,111 కాపర్తి సాయి కృష్ణ కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ సభ్యులు బి.శశిధర్ రెడ్డి, గోరిశెట్టి సంజయ్, యోగానంద్ రెడ్డి, సంతోష్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, యశ్వంత్ కుమార్, మండలి సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మండలి సభ్యులు సాయికేతన్ షిండే, చంద్ర, సూర్య, చంద్ర రెడ్డి, కస్తూరి, పరమేశ్వర్, కళ్యాణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మెదరులను ఎస్టీ జాబితాలో చేర్చుటకు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం సిపారసు చేయాలని మేదరి సంఘం నాయకులు అన్నారు. సెప్టెంబర్ 18 ప్రపంచ వెదురు దినోత్సవాన్ని జిల్లా, పట్టణ మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో వినాయకనగర్ లో గల అమరవీరుల విగ్రహాల పార్కు నందు ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు దర్శనం దేవేందర్ మాట్లాడుతూ మేదరులు అన్ని విధాలుగా వెనకబడి వున్నారని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుకుంటు, వెదురుపై ఆధారపడి వెదురుచే పనిముట్లు తయారుచేసి అమ్మి జీవనం సాగించే మెదరులకు ఈనాడు మెటల్, ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్ లోకి రావటంతో తయారుచేసిన పనిముట్లకు గిరాకీ లేక బతుకు భారమై తమ కుటుంబాలను పోషించు కోలేక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 18 ప్రపంచ వెదురు దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్ నీడ కోశాద్రి, కార్యదర్శి గంగాధర్, బాబురావు, యామ నరసయ్య, ఐ.నరేష్, జె సుదర్శన్, జి గంగాధర్, పి నారాయణ, ఏగొండస్వామి, పి. తిరుమల, రమేష్, బీసీ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, బసవ, జిల్లాలోని మేదరులు మహిళలు పాల్గొన్నారు.



నిజామాబాద్ సిటీ :నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం

పిట్లం : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారము మండల మేదర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేదర్ల కుల దైవం కేతేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ప్రజలు పర్యావరణాన్ని కాపాడే వెదురు ఉత్పత్తులను వాడకుండా పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ వస్తువులను వాడుతూ అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని అన్నారు. మార్కెట్లో ప్లాస్టిక్ ఉత్పత్తులు పెరగడంతో వెదురు ఉత్పత్తులపై ఆధారపడిన మేధారులంతా జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టి సారించి వెదురు ఉత్పత్తులను పెంచి సబ్సిడీ ద్వారా వెదురును అందించి మేదర్ల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మేదర్ల సంఘం సభ్యులు రవి, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రమేష్ , ఎల్లయ్య, వీరేశం, అశోక్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో..

20 నుండి పీజీ మొదటి సంవత్సర పరీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో ఈ నెల 20 నుండి పిజి ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. రామ్ మోహన్ రెడ్డి, అధ్యాయన కేంద్ర రిజినల్ కో- ఆర్డినేటర్ కే. రంజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిక్షకు హజరయ్యే విద్యార్థులు హాలెటికెట్‌తోపాటు తప్పని సరిగా ఐడి ప్రూఫ్ తీసుకొని రాగలరని తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు అంబేద్కర్ యునివర్సిటి వెబ్సైట్ www.braou లో మరింత సమచారం కోసం ఈ ఫోన్ 7382929612 నంబరును సంప్రదించాలని తెలిపారు.

లడ్డుల వేలానికి హెూరాహెూరా పోటీ

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ముకుంద రెడ్డి , రాధాస్వామి , శాంతినగర్ గణేష్ మండలి కాలనీ వాసులు వినాయక చవితి పర్వదినమును పురస్కరించుకొని ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడికి 11 రోజులపాటు పూజలు నిర్వహించి మంగళవారం రాత్రి నిమజ్జనం లో భాగంగా లడ్డు వేలం పాటలను హెూరాహెూరీగా నిర్వహించారు. ముకుందరెడ్డి కాలనీ విఘ్నేశ్వరుడి లడ్డు వేలం పాటలో మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ సరిత సూరత్‌రెడ్డి దంపతులు 5,01,116 రూపాయలకు దక్కించుకున్నారు. రాధాస్వామి గణేష్ లడ్డును విజయ్ గుప్తా ఒక లక్ష 8 వేల 999 కైవసం చేసుకున్నారు. శాంతినగర్ శ్రీరామ గణేష్ మండలి లడ్డు మహా ప్రసాదం ను మటన్ కాడి రాజు 17 వేల ఒక రూపాయికి దక్కించుకోగా కలశం యొక్క వేలంపాటలో గుణంగి బాలరాజ్ 7వేల 777 రూపాయలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండలి సభ్యులు , పలు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

కాకతీయ కాలువలో యువకుడు గల్లంతు

నవతెలంగాణ-మెండోర



కాకతీయ కాలువలో తన భర్త గల్లంతయ్యాడని ధ్యారంగుల రాజమణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నారాయణ బుధవారం తెలిపారు. ధ్యారంగుల చిన్న మారెన్న (32) కొన్ని రోజులుగా మద్యానికి బానిసై బుధవారం ఉదయం మద్యం తాగి మధ్యాహ్నం రెండు గంటలకు మెండోర దగ్గర ఉన్న కాకతీయ కాలువలో పడి గల్లంతు అయ్యాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బియ్యం లారీని పట్టుకున్న స్థానికులు

చోద్యం చేస్తున్న అధికారఘనం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలి వెళ్తున్న బియ్యం బస్తాలతో నిండిన లారీని స్థానికులు పట్టుకుని అధికారులకు అప్పగించారు. కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలం కుర్ల నుంచి 295 క్వింటాళ్ల ధాన్యంతో బీర్కూర్ మండల కేంద్రం నుండి బియ్యం లారీ తరలి వెళుతుండగా స్థానికులకు అనుమానం వచ్చి లారీ డ్రైవర్ను నిలదీయడం, ధాన్యానికి సంబంధించిన పత్రాలు చూపాలని డ్రైవర్ ను ప్రశ్నించగా డ్రైవర్ వద్ద అప్పటి వరకు ఎలాంటి పత్రాలు చూపక పోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి బీర్కూర్ తాహశీల్దార్ లతకు సమాచారం అందించారు. దీనితో ఆమె తాహశీల్దార్ పోలీసులకు లారీని అప్పగించడం, నిన్న రాత్రి పట్టుకున్న అప్పుడు ఎలాంటి పత్రాలు చూపని డ్రైవర్, యాజమాన్యం బుదవారం వర్నిలో మార్కెట్ కమిటీకి టాక్స్ కట్టినట్లు, నిజామాబాద్ జిల్లా వర్ని నుంచి కాకినాడ జిల్లా పెద్దపూరం కు దాన్యం తరలిస్తున్నట్లు వేబిల్లులు సృష్టించడం అందరినీ అనుమానాలకు తావిస్తుంది. స్థానికులు, రెవెన్యూ అధికారుల అధ్వర్యంలో పోలీస్ స్టేషన్ లో అక్రమ బియ్యం లారీని పెట్టిన స్పందించని యాజమాన్యం ఒక్క రోజు లోనే పత్రాలు తయారు చేసి ఇవ్వడం పట్ల స్థానికులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్ని మార్కెట్ కమిటీ అధ్వర్యంలో వెబిల్ ఉండగా మరి దోగ్లి మండలం కుర్ల గ్రామం నుంచి బీర్కుర్ మీదగా ఎందుకు వెళ్తుంది అంటూ అధికారులకు ప్రశ్నిస్తున్నారు. అక్రమ దారులకు అధికారులే కుమ్మక్కు కావడంతో అడ్డు అదుపు లేకుండా బియ్యం అక్రమంగా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ బియ్యం లారీని స్థానికులు పట్టుకుంటే అధికారులు వచ్చి పత్రాలు అన్ని ఉన్నాయంటూ చూపడం విడ్డూరంగా ఉందన్నారు. లక్షల జీతాలు తీసుకుంటూ అక్రమదారులకు కొమ్ముకాస్తున్నారు. అంటూ స్థానిక ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పత్రాలు లేకుండా చూపకుండా బియ్యం లారీ వెళ్లడంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీస్ స్టేషన్ కు అప్పగించారని ఎస్ఐ రాజశేఖర్ వివరణ ఇచ్చారు. డివిజన్ విజిలెన్స్ అధికారి ఖాజాను వివరణ కోరగా స్థానిక ప్రజలకు అనుమానంతో బియ్యం లారీ పట్టుకున్నారు. ఉదయం పత్రాలు చూపించారు. వర్ని నుంచి పెద్దాపురం బియ్యం లారీ వెళ్తుందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు.

వైభవంగా శోభాయాత్ర

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని రెంజల్, సాటాపూర్, దూపల్లి, తాడిబిలోలి గ్రామాలలో లంబోదరుడి శోభాయాత్రలు వైభవంగా కొనసాగాయి. మంగళవారం రాత్రి 12 దాటిన గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర వెంట యువతీ యువకులు నృత్యాలు చేస్తూ పలువురిని ఆకర్షించారు. వినాయకుడి రథాలను అందంగా తయారు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఈ. సాయన్న ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రార్థన మందిరాల వద్ద పోలీసు బలగాలను మోహరించారు. గ్రామాలలో ఎలాంటి ఘర్షణలకు తావివ్వకుండా, కుల సంఘాలు, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు.

నేడు రైతుల ధర్నా

నవతెలంగాణ- ఆర్మూర్

ప్రభుత్వం రెండులక్షల రుణమాఫీ రైతు భరోసా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ రైతు ఐక్యకార్యాచరణ కమిటీ డివిజన్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆర్మూర్, బాల్కొండ నిజామాబాద్ రూరల్ మూడు నియోజకవర్గాల పరిధిలో గల తహశీల్దార్ ఆఫీసుల ఎదుట నిరసన (ధర్నా)కార్యక్రమం, ఉంటుందని తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని రైతు ఐక్య కార్య చరణ కమిటీ సభ్యులు వి ప్రభాకర్ ఇట్టడి లింగారెడ్డి, నూతుల శ్రీనివాస్ రెడ్డి, దేగాం యాదాగౌడ్ , దేవరాం తిరుపతిరెడ్డి కోరారు.

పాఠశాలలో పనులను నాణ్యతతో చేపట్టాలి

- **ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో చేపడుతున్న మరుగుదొడ్ల పనులను నాణ్యతగా చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన పాఠశాలలో జరుగుతున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. హెచ్ఎం బాలచంద్రం పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కిచెన్ షెడ్ లేక ఇబ్బందులు అవుతున్నాయని కిచెన్ షెడ్ పనులు చేయించాలని, ద్యార్థులకు తాగునీటి కోసం ట్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలకు అవసరమైన పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు ఇవ్వడం జరగదని కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు. అనంతరం సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో సరిపడా అధ్యాపకులు లేరని, వారి నియామకానికి కృషి చేయాలని ప్రిన్సిపల్ నిఖత్ కౌసర్ కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కళాశాలలో కావలసిన పనులకు ప్రతిపాదన సిద్ధం చేసి పంపాలని మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణను ఆదేశించారు. కళాశాలలో బాలికల మరుగుదొడ్లను పరిశీలించి దానికి చేపట్టవలసిన మరమత్తులు చేయాలని ఏఈ శ్రీనివాస్ కు సూచించారు. కళాశాల ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం కళాశాల గ్రౌండ్లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనాన్ని పరిశీలించారు. అంతకుముందు బోధన్ పట్టణంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో కొట్టు శిక్షణ పొందిన మహిళలకు ఆయన సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ప్రిన్సిపాల్ నిఖత్ కౌసర్ ను ఆదేశించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ తూము పద్మావతి ,మైనార్టీ కమిషన్ చైర్మన్ తాహెర్, ఏఎంసి వైస్ చైర్మన్ శీల శంకర్, హెచ్ఎం బాలచంద్రం, ఎసిపి శ్రీనివాస్, నాయకులు గంగా శంకర్, నాగేశ్వరరావు, దాము, బిల్ల రామ్మోహన్, పులి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

విద్యాశాఖ కార్యాలయ స్థలాన్ని కేటాయించండి

- **ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతి**

నవతెలంగాణ కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల పాత విద్యాశాఖ కార్యాలయ స్థలాన్ని జిల్లాకోర్టు అవసరాలకు అనుగుణంగా కేటాయించాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ రాష్ట్ర మాజీమంత్రి, బోధన్ శాసన సభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి కి సమర్పించిన వినతిపత్రంలో కోరారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి, బార్ ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి దీపక్, సీనియర్ న్యాయవాదులు మంచికంటి గోవర్ధన్, ఆకుల రమేష్, రాజేశ్వర్ రెడ్డి, ఎర్రం గణపతి, శ్రీహరి ఆచార్య, రాజలింగం, గడుగు గంగాధర్ కలిసి సుదర్శన్ రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. జిల్లాకోర్టు ప్రాంగణంలో కక్షిదారుల ప్రయోజనాల దృష్ట్యా కోర్టుల సంఖ్య పెరగడం, దానికి అనుగుణంగా కక్షిదారులు పెరగడం మూలంగా తీవ్రమైన ట్రాఫిక్ ఒత్తిడికి అవుతుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా జ్యూడిషియరిలో పాక్సో కోర్టు, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, 5 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఉమెన్స్ కోర్టులు దానికి అనుగుణంగా న్యాయమూర్తులు ఉన్నారని, న్యాయ సిబ్బంది పెరగడం మూలంగా జిల్లాకోర్టు అవరలోని స్థలం సరిపోవడం లేదని విన్నవించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు ఓపెన్ స్థలం లేకపోడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లాకోర్టుకు ఆనుకుని ఉన్న పాత విద్యాశాఖ కార్యాలయ ఖాళీ స్థలం జిల్లా జ్యూడిషియరికి కేటాయించే విదంగా కృషి చేయాలని జగన్ కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మాజీమంత్రి, బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి సానుకూలంగా స్పందించి జిల్లా వాసిగా, జిల్లాకోర్టు అవసరాలకు, న్యాయవాదుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి న్యాయం చేస్తానని తెలిపారని అన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ఆర్టీసీ ఉద్యోగులకు చక్ర అవార్డుల ప్రదానం

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ రీజియన్ స్థాయిలో బోధన్ డిపోలో ఏప్రిల్ 24 నుంచి జూన్ 24 వరకు మొదటి త్రైమాసికంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బుధవారం ప్రగతి చక్రం అవార్డులను అందించారు. కార్యక్రమంలో నిజామాబాద్ రీజనల్ మేనేజర్ జానిరెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఉద్యోగులను అభినందిస్తూ, నగదు పురస్కారాలను అందించటం జరిగిందని తెలిపారు. అలాగే వీరిని ఆదర్శంగా తీసుకొని, మిగతా ఉద్యోగులు కూడా కష్టపడి పనిచేస్తూ ముందు ముందు ఇలాంటి అవార్డులను సాధించాలని సూచించారు. ప్రయాణీకులకు ఉత్తమ సేవలను అందిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, ఏటీపీఓ, సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కేజీ బీవీలలో తాత్కాలిక ఉద్యోగులకు దరఖాస్తు ఆహ్వానం

జిల్లా విద్యాశాఖ అధికారి రాజు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కేజీబీవీ పాఠశాలలలో తాత్కాలిక ఉద్యోగాలకు దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఒక ప్రకటనలు తెలిపారు. పీ జీ సి ఆర్ టి లు, సి ఆర్ టి లు, పీఈటీల పోస్టుల భర్తీకై (1:1) జాబితాను ఉుఉ.ఎవశీఝఝతీవఎ-ఎఎ.ఱఅలో పొందుపరచినట్టు తెలిపారు. గురువారం 19-9-2024న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎంపిక చేయబడిన అభ్యర్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియ ఉంటుందని, ఆ ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్ల తీసుకొని ఉదయం 9 గంటలకు జిల్లా కార్యాలయానికి రావాలనీ అప్రకటనలో పేర్కొన్నారు.

వరి పంట క్షేత్రాలను సందర్శించిన శాస్త్రవేత్తలు



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి గ్రామంలో వరి పంటలలను సహాయ వ్యవసాయ సంచాలకులు నిజామాబాద్ రూరల్ ప్రదీప్ కుమార్, ఆర్ఎఆర్ఎస్, జగిత్యాల్ శాస్త్రవేత్తలు గొనియ నాయక్, బలరాం, కె.వి.కె శాస్త్రవేత్త విజయకుమార్ బుధవారం సందర్శించారు. వరిపై సుడిదోమ, కంకినల్లి ఆశించినట్లు గుర్తించినట్టు తెలిపారు. సుడిదోమకు ట్రై ఫ్లూమేజో పైరిము మరియు కంకినల్లికి స్పైరో మిసిఫిరాన్, ప్రాఫి కొనోజోల్ కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా గట్లు శుభ్రంగా ఉంచుకోవాలని, యూరియా మోతాదు తగ్గించాలని, పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు,శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారిని, వ్యవసాయ విస్తరణ అధికారి మరియు రైతులు పాల్గొన్నారు.

కొనసాగిన గణేష్ నిమజ్జనాలు



12వ రోజు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పులాంగ్ చౌరస్తా వద్ద ఇంకా నృత్యం చేస్తున్న ఓమండలి యువకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/మద్నూర్

గణేశ్ నిమజ్జనాలు నిజామాబాద్ నగరంలో రెండో రోజైన బుధవారం మధ్యాహ్నం వరకూ కొనసాగింది. ఎనిమిది ఫీట్ల కన్నా ఎక్కువ ఎత్తున్న విగ్రహాలను నగరంతో పాటు ఆయా ప్రాంతాల నుంచి ఉమ్మెడ గోదావరి తీరానికి తరలించారు. భారీ విగ్రహాలు నగరం మీదుగా తరలిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రథ యాత్ర కూడా నెమ్మదిగానే సాగింది. మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలైన రథం వినాయక బావిని చేరుకోవడానికి దాదాపు అర్ధరాత్రి 12:30 గంటలైంది. నగరంలో మిగితా గణపతులను నిమజ్జనం కోసం తరలించే విషయంలో జాప్యం చోటుచేసుకుంది. ఎనిమిది అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలను బాసర గోదావరి చెరువు కు తరలించారు. భారీ విగ్రహాలను మాత్రం నందిపేట్ మండలం ఉమ్మెడ గోదావరిలో భజనలు, డీజే సౌండ్ లతో కోలాహలంగా నిర్వహించారు. ఎక్కడ అంతరాయం కలగకుండా మూడు క్రేన్ల ద్వారా నిమజ్జనం చేయించారు. భారీ విగ్రహాలకోసం గోదావరి వద్ద భారీ క్రేన్‌లను అందుబాటులో పెట్టారు. ఇక్కడ భారీ విగ్రహాలు మంగళవారం అర్ధరాత్రే చేరుకుంటాయని భావించారు. కానీ మరుసటి రోజు బుధవారం ఉదయం 10 నుండి 11 గంటల తరవాతే వచ్చాయి. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. సీపీ కల్మేశ్వర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

మద్నూర్: మద్నూర్ మండల కేంద్రంలో ఈ ఏడాది గణేష్ చవితి గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన భారీ ఎత్తున జరిగాయి. మండల కేంద్రంలో దాదాపు 50 వరకు గణేష్ మండళ్లు పెద్దపెద్ద విగ్రహాలతో ఏర్పాటు చేశారు. 11 రోజుల పాటు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 17న గంగమ్మ ఒడికి చేరవలసిన గణనాథులు 18న చేరాయి. ఎందుకంటే ఈనెల 17న గణనాధుల శోభాయాత్ర ప్రారంభమై రాత్రంతా మండల కేంద్రంలో మెన్ వాడల గుండా గణనాధుల విగ్రహాలు ఊరేగింపుగా మండల కేంద్రం పరిధిలోని మైసమ్మ చెరుకు బుధవారం ఉదయం చేరుకున్నాయి.